యీ వెస్ట్రిన్ ఎడ్యుకేషన్ ప్రకారణము

ఇప్పటి కాలంలో నాసోదరిని చేరదియ్యక నన్ను ప్రేమించకుండా ఉంటారే అలాంటిపల్లెటూరుబచ్చాలు ఎవరైన సిటీస్‌లోకి వచ్చారంటేచాలు నాప్రభావం చూపించేస్తా. నాలవర్స్ అందరిని పుకికొలిపివేసి వాళ్లుమెచ్చుకుంటూ వాణ్ణిచూడడం తోటే వాడిగుణాలు ఎవడికికావాలి? వాడితెల్వితేట లెవడికికావాలి? వాణ్ణి ఇన్‌డైరక్టుగా రిడిక్యూల్ చేసేవి తూటింగ్స్ క్లాపింగ్స్ జరుపుతూంటే, వాడిమొగంలోరక్తం చుక్క లేకపోతే ఉండే సంబరంలో డ్యాన్సు చేస్తూంటాను. బలే! సమర్థతఅంటే నాదేసమర్థత! అందులో నాకుదొరకిన వాళ్లుకూడా వేలంవెఱ్ఱి వాళ్ళవడం తోటే నేను 'కా' అంటే 'కా' క్కి అంటే 'కి' ఇదివరకు ఫ్యామస్ ప్రభావం వినని వాళ్లుంటే ఇప్పుడైనా తెలిసికోండి. దేశాలుదేశాలు తెగించి యేమి? దేశాలా? ఖండాలుగడచిసముద్రాలు దాటి ముప్పైఐదు కోట్ల భారతీయ యువకుల హృదయముల నాకర్షించి వశ్యం చేసుకున్న మాసిస్టర్స్ ఎంతగొప్పవాళ్ళో ఎంతచతురులో ఆలోచించండి. మాముందీ వశీకరణ మంత్రాలు తంత్రాలు ఏమీ పనికిరావు. అంచేత మాదేశాటనానికి తగినఫలం దొరకింది. సరే! అన్నిదేశాలు తిరిగి, యీహిందూ దేశం వచ్చావుకదా ఇక్కడినుంచి వెళ్ళడం ఎప్పుడంటారా వినండి చెబుతా. నన్నాదరించిన యువకులంతా మడిమాన్యాలన్నీ అమ్మి ధ్వంసమై అప్పులపాలై చిప్పకర్రి చేతికివచ్చి ఎప్పుడు నా ముద్దుదీర్చలేక పోతారో అప్పుడు వెళ్ళడం.

ఇంత గొప్పవాళ్ళం కాబట్టే అందులో నేను నాపేరు (ఫ్యామస్) అనేసరికల్లా నాజన్మస్థానం పేరు జ్ఞాపకం వచ్చేటట్టు చేశాను. నాప్రతాపం అన్నిదేశాల్లోను మారు మోగింది. ఏదేశానికి వెళ్ళినా నన్నాదరిస్తారు. ఇంకేం కావాలినాఎని కిర్రి హాయ్ హాయ్ హాయ్.

# స్వేచ్ఛావిహారిణి

పుల్లాభొట్ల సూర్యనారాయణశాస్త్రిగారు.

౧

ఆవేళ సాయంత్రం ఆరుగంటలకి రాజ్యం అయ్యంగారి గానసభ హిందూ యువజనసంఘ హాలులోనని నోటీసులు పంచిపెట్టారు. జనులంతా అయ్యంగారి పాట చాలాగొప్పదని వినుంటారు చాలాచాల్లు. కనుకనే టిక్కెట్లుకొని హాజరయ్యారు నాలుగుగంటలకే. ఆడాళ్లు, మొగాళ్లు పిల్లలు, సంగీతం విషయం తెలిసినవాళ్లు తెలియనివాళ్లు- అందరు కిక్కిరిసి ఒకరిమీద ఒకరు కూర్చున్నారు. నేనుకూడా ఓటిక్కెట్టుకొని బయల్దేరాను ఐదున్నరకి. వెళ్లిచూస్తినిగదా - హాలంతా నిండిపోయింది. సరే ఎల్లాగో సర్దుకుంటూ ఆడాళ్లకు-మొగాళ్లకు మధ్య కట్టిన తడికదగ్గరకు చేరుకున్నాను. ఆడాళ్లదగ్గరకెందుకుచేరావోయి? అని మాసోదరులెవరైనా అడుగుతారేమో-అది మాకెప్పుడూ అలవాటేలేండి. ఎల్లాగైతేనేం అక్కడోకుర్చీ సంపాదించాను. అయ్యంగారు స్టేజి మీదకు వచ్చాడు. ఒకటి... రెండు కృతులైపోయాయి. 'జగదోద్ధారణ' అని మొదలెట్టాడు కృతులెన్నో పాడుతూనే ఉన్నాడు అయ్యంగారు.

87

ప్రజలంతా 'ఆహా! భేష్!' అని ఆనందిస్తున్నారు. కాని నాదృష్టంతా వేరేవుంది.

నాప్రక్కనే తడికవతల ఒక పదునెనిమిదేండ్ల చక్కని పడుచు-ఒక తొమ్మిదేండ్ల కుర్రాడితో కూర్చొని ఉంది. ఆవాలుజెడ, ఆజడలోని మల్లె పూలు, ఆఅంగసౌష్టవము, కుచరులసొరు-ఆ గ్లాస్కోసీర- ఆసిల్కుజాకెట్టు- ఆబులబులాగ్గా వ్రేలాడుతూన్న లోలకులు-ఇంకా ఎన్నోనగల తోను-అవిణ్ని పుట్టించిన బ్రహ్మకైనా వర్ణించ డానికి తరంకాకుండా ఉన్నదామ్మాయి. అల్లాంటి ఆకాంతారత్నాన్ని చూస్తూ, ఆనందిస్తూన్నా. ఒక్కర్తే వచ్చిందేమూఅని సందేహంకలిగింది. ఈ పిల్లదేపేటా అని ఆలోచించాను. ఎందుకంటే ఏలూరంతా మనకి కొట్టినపిండేకదూ. ఆలోచించగా ఆఖరికి పవర్ పేటని ఫలానిల్లనిగుర్తొచ్చింది. ఆఅమ్మాయి ఒక రెవెన్యూ ఇనస్పెక్టరుగారి కూతురు. సరే అని మనస్సులో సంతోషించి ఒక సైటుకొట్టా. వెంటనే బార్ మాగ్నట్‌లా అందుకొని చిరునవ్వుతో సాభిప్రాయముగాచూచింది. తొమ్మిదిగంటలకు సభ ముగిసింది. ఆఅమ్మాయి ఎక్కడ తప్పిపోతుందో అని వెతుక్కుంటూ వెనకాలే బయల్దేరా. జనులంతా ఎవరిత్రోవను వాళ్లెళ్లిపోయారు. సరే ఏకాంతంగా సమయం దొరికింది గదా యని ఆఅమ్మాయి వెనకాలే బయల్దేరా. వాళ్లకుర్రాడు ముందర వెళుతున్నాడని 'ఒరేరామూ! ఏమిటాతొందర? ఆగు, నేనూ వస్తూన్నాగా' అంది నేను వెనకాలేఉండి 'మీకు మాత్రం తొందరెందుకూ ? నేనూ వస్తూనే ఉన్నాగా' అన్నా మెల్లగా వినిపించీ, వినిపించకుండాను. ఆవిడ ఉలిక్కిపడి వెనక్కిచూచి చిరునవ్వుతో 'అందుకేగా నేనూఆగానూ...మీకోసమే' అంది.

'ఆకుర్రాడు మీతమ్ముడా?' అన్నాను.

'అవునండి; మీరు మీరని పిలవక్కర్లేదండి' అని తలవంచుకొన్నది.

'నీపేరెవ్వరో జ్ఞాపకం లేదు' అన్నాను

'పద్మావతి' అంది మెల్లిగా సిగ్గుతో

'మీరెప్పుడైనా మావీధి కొచ్చేవారు ఇప్పుడురావడం మానేశారేం? '.

'ఏమీలేదు తీరుబాటులేక పరీక్షకు చదువుతున్నానుగా మరి' అన్నాను.

'ఐతే ఇప్పుడు మీఇంట్లో ఎవరెవరుంటున్నారు? ' అని అడిగాను.

'నేను మానాన్నగారు, మాతమ్ముడు ఇదు నోపీడే మాఅమ్మ మూడురోజులకిందట పురిటికెళ్లింది. ఎవరున్నారు మేము ముగ్గురమూ ఉంటున్నాము.

మీరీరాత్రి నాకు కొంచెం సాయంపడుకోడానికి రాకూ? మానాన్నగారు సర్క్యూటువెళ్లారు మధ్యాహ్నం. ఒక్కదాన్నే పడుకోవాలి' అంది వెర్రిచూపుల్తోటి, వేలతనం తోటిన్ని

'సరే భోంచేసి వస్తాలేండి' అన్నా ఉత్సాహంతో తర్వాత ఆమెను వదల్లేక, వదల్లేక కర్రివంతెనవరకు తీసికెళ్ళి దిగబెట్టి మాఇంటికిదారి తీశాను.

౨

త్వరత్వరగా భోంచేసి, కిర్రీవేసికొని, కొంచెం స్నోపూసికొని, క్రాపుదువ్వుకొని మావాళ్ళతో శివరావింటికి చదువుకోడాని కెళ్లుతున్నానని, రాత్రిపడుకోడానికి రానని చెప్పి బయల్దేరాను. అప్పుడు రాత్రి పదిగంటలైంది. పట్టణమంతా నిశ్శబ్దంగా ఉంది. అతివేగంతో కులాసాగా పద్మావతిల్లు చేరుకున్నా. అది వెన్నెల రాత్రి అగులచే నడిచినట్లేలేదు. పాపం నాకో

నిమే కాబోలు. తలుపు దగ్గిరగావేసి ఉంచింది. తిన్నగా తలుపు గెంటుకుని లోపలి కెళ్ళి చూస్తి నిగదా పెద్దమంచంమీద సీటుగా పక్కేస్తోంది. నన్ను చూచి 'దయచేయండి' అంది మంచం చూపింది. నేకూర్చున్నాక తనునా పక్కనే కూచుంది 'పద్మా! నాకోసమింత కష్టపడ్డావుగదా!' అన్నాను నెమ్మదిగా, చెక్కిలి సొరుచూస్తూ.

'మీకోసమేం? నాకోసమే కష్టపడ్డాను' అంది నావళ్ళోకి వరిగి. నాసంతోషమునకు మేరలేక వెంటనే చటుక్కున ఒక్క ముద్దుపెట్టుకున్నాను. ఆతర్వాత ఒకటి... రెండు... మూడు... వరుసగా ముద్దులు తనివితీరే వరకున్నా.



ఇంక ఏం కావాలీ? ప్రపంచమంతా ఆనందమయంగా మాకు కనిపించింది.

'పద్మా! నీభర్త ఎప్పుడూ ఇక్కడికి రాలేదు ఏవూళ్ళో ఉన్నారు? ఎన్నేళ్లుంటాయి? నిన్ను రెండో పెళ్లివాడి కిచ్చారని విన్నానులే మరేమి అనుకోకేం' అన్నాను.

'యాభైఏళ్లుంటాయి- ఆయనెప్పుడూ ఇక్కడికి రాలేదు. విశాఖపట్నంలోనే ఉన్నారు ప్రస్తుతం' అన్నది విచారంగా.

'పద్మా! మనమిద్దరంకూ ఇవ్వాళ మొదలు ఒకే ప్రాణంగా సంచరించాలి' అని దగ్గరగా తీసికొని హృదయమునకు గట్టిగా అదుముకొని ముద్దెట్టుకున్నాను.

'ఔను ఆ అమాయికపు పిల్ల ఆముసలిభర్తతో ఏంకాపురం చేస్తుంది' అని మనస్సులోజాలి పడి ఆరాత్రి అక్కడ ఆనందవాహినిలో కాలం గడిపి ఉదయాన్నే ఇంటికి చేరాను.

3

స్త్రీహృదయం సముద్రమునకంటె మిక్కిలి లోతైనదని మనపెద్దలు చెప్పెదరు. కొన్నిసంవత్సరములు ప్రయత్నముచేసినను, ఒకొక్క స్త్రీమనస్సులోని ఉద్దేశ్యములను పురుషుడు కనిపెట్టలేడు. భగవంతుడు స్త్రీలయందు ఒకవిధమగు ఆకర్షణశక్తిని పెట్టుటచే, పురుషుడు స్త్రీ లాలనమునబడి, చేలరై మోహాంధకారమున కన్నుగానక ఆమె చేతియందలి కీలుబొమ్మయై మెలగుచుండును. ఇట్టి స్త్రీలను అబల లనుటకంటె వారివశమందుండి వారిపెట్టుపోతలలో మెలగెడి పురుషుల (హెన్‌పెక్డ్ హస్‌బెండ్స్) కానామమిడుట మిక్కిలి శ్రేష్టము. ఒకపురుషుడొక స్త్రీని ప్రేమించినపుడు ఆమెకూడ తన్ను నిష్కల్మషముగా ప్రేమించుచున్నదని భావించి, ఆప్రేమ శాశ్వతమైనదనియే తలంచును. కాని ఆమెమనస్సు చంచలమైనదా? దృఢమైనదా? తనను మాత్రమే ప్రేమించుచున్నదా? మరింకెవ్వరినైనను ప్రేమించుచున్నదా? అనెడి పరీక్షలను చేయడు. అట్టి అనుమానాస్పదమగు పరీక్షలను చేసిన తనకు నామెకు స్నేహము విడిపోవునెడి భయమున ఆమెచెప్పినటె మెలగుచుండును. పై విధముగా స్త్రీహృదయము కనిపెట్టలేక పోవుటచే నాబోటివారు గోతిలో పడుచుందురు.

ఇంతవరకును 'నేను, నేన'ని వ్రాసినాపేరు

గాని, నన్ను గురించిగాని వ్రాయకపోయినందులకు చదువరులను క్షమింప గోరుచున్నాను. నా పేరు నారాయణమూర్తి. మాతండ్రి చాలాఆస్తిసంపాదించి రెండుసంవత్సరముల క్రిందట స్వర్గస్థుడయ్యెను. మాకు ఏలూరిలో పడమటివీధిలో ఒకడాబాయిల్లు కలదు. అదికూడ మాతండ్రికొన్నదే. ప్రస్తుతం మాఇంటియందు నేను, మాతమ్ముడు (పండ్రెండేండ్లవాడు) మాఅమ్మ మాత్రమే ఉంటున్నాము. మాకు సాలుకుమూడువేలరూపాయిలు పొలంమీద వస్తాయి. ఇంటి అద్దెకూడ నెలకు ముప్పై రూపాయిలొస్తాయి మాతండ్రి పోయినప్పటినుండి అప్పులేమి చేయకఉన్న దాంట్లోనే కాలక్షేపం చేస్తున్నాము. నాకు పందొమ్మిది సంవత్సరములు నిండినవి. నాకు అవసరమయ్యే ఖర్చుచేసికొనుటకు నాయింట్లో నేను స్వతంత్రుడను. ఒక సంవత్సరం స్కూల్‌ఫైనల్ పోయింది. రెండవ సంవత్సరం పరీక్షకు ప్రైవేటుగా అప్లైచేశాను. మార్చినెల ఇరవైఐదవ తారీకు మొదలు పరీక్షలు జరుగుతాయి. ఫిబ్రవరిలో నాకూపద్మకూ స్నేహం కలిసింది. అప్పటినుండి ప్రతీదినం ఏదోఒకపూట పద్మయింటికి వెళ్ళివస్తూండేవాణ్ని. సాధారణంగా పద్మ సంవత్సరమునకు తొమ్మిదినెలలు పుట్టింట్లోను, మూడునెలలు మాత్రమే భర్తదగ్గర ఉండేది. ఆలమ్మాయి ఐదవఫారం ప్యాసయింది. ఈలోపుగా వాళ్ళవాళ్లు పెళ్లిచేయుటచే చదువుకు స్వస్తిచెప్పింది. నవనాగరపు యువతులలో ఆమెఒకతె. సంగీతంకూడ నేర్చుకున్నది. చిన్నప్పుడు చాలాబాగా పాడగలది.

౪

మాకు మార్చిలో పరీక్షలై పోయినవి. వేసంగిలో కూడ పద్మ ఏలూరులోనే ఉన్నది. ఆమెభర్తకూడ వచ్చి ఒకనెలరోజులుండి, పద్మనుతర్వాత పంపుతామని మామగారు చెప్పటచే అతడొక్కడే వెళ్లిపోయాడు. విశాఖపట్నంలో పద్మావాళ్లింట్లో వంటమనిషి వంటచేస్తుంది. పరిచారికలు చాలమంది ఉన్నారు వాళ్లే చిల్లరపనులన్ని చేస్తారు. పద్మ ఏపనియు చేయనక్కరలేదు. కనుక అక్కడున్నపు డేదోపుస్తకం చదువుకుంటూ కూర్చునేదట. ఈసంగతులన్నీ ఆమె నాకు చెప్పింది. లేకపోతే ఎట్లా తెలుస్తాయి లెండి? పద్మభర్త ఏలూరులో ఉన్నపుడు నాకు వాళ్లింటికి వెళ్లడానికి బహుకష్టంగా ఉండేది. ఐనా ఎప్పుడేనా సమయం కనిపెట్టి వెడదామని ప్రయత్నిస్తే లాభం లేకపోయేది. ఆనెలరోజులూ అలాగే కష్టపడ్డాం ఇద్దరమూ కూడాను.

శెలవలైపోయాయి నేను ప్యాసయినట్లు గెజిట్‌లో పడ్డది. ఇంక ఇంటర్ చదువు మద్రాసులో పెట్టడానికి నిశ్చయించాను. పద్మతో నేను మద్రాసు వెళ్ళిపోతానని చెప్పాను. తను కూడా వస్తానంది. ఎట్లా ? వీలుండదేమో' అన్నాను. ఏలాగైనా తప్పక వస్తానంది. 'సరేనే వెళ్లాక నీవు బయలుదేరి వద్దువుగాని' అనిచెప్పి నేముందరవెళ్లి పచ్చయ్యప్పాస్ కాలేజీలో ప్రవేశించాను. ట్రిప్లికేనులో నెలకు ఇరవైరూపాయలద్దెచొప్పున ఒకయిల్లు తీసికొన్నాను. పద్మ నేను వచ్చేటప్పుడు తనకుమాత్రమే ఉత్తరములందేటట్లుగా ఒకఎడ్రెసు ఇచ్చింది. ఆఎడ్రెసుమీద నాఇంటి నంబరు వగైరాలన్నీ తెలియబరుస్తూ వెంటనే బయలుదేరి రమ్మని పద్మకు వ్రాశాను కానీ, ఎట్లాబయల్దేరి వస్తుందా యని మనస్సులో సందేహం గానేఉన్నది.

ఉత్తరం అందిన మర్నాడు తెల్లవారుగట్ల మూడుగంటల ప్యాసింజరులో తనభర్త ఇచ్చిన

యాభై రూపాయలు తీసికొని పద్మ కట్టుగుడ్డలతో బయల్దేరి వచ్చేసింది. నేనామె సాహసానికాశ్చర్యపడిపోయాను. 'పద్మా! ఏమిటి? ఎల్లాబయల్దేరి వచ్చావు? చెప్పు! అన్నాను. తనతో స్నేహితురాలు వాళ్ల పక్కింట్లోనే ఉన్నదట. ఆఅమ్మాయి స్కూల్ ఫైనల్ చదువుతోందట. తనకుప్రాణస్నేహితు రాలగుటచే ఆఅమ్మాయితో తనసంగతులన్నీ పూసగుచ్చి నట్లు చెప్పి తప్పకసహాయ్యము చేయమని కోరిందట. వాళ్లిద్దరూకలసి ఆలోచించి, బయల్దేరిన నాడురాత్రి తనస్నేహితురాలి చదువుకొనే రూములో పడుకొని, తెల్లవారు ఝామున నే లేచి దాసీదాని సహాయమున రైలెక్కి వచ్చేసిందట. ఈసంగతులన్నీ నాతో చెప్పేటప్పటికి 'ఆహా! పద్మా! నువ్వెంతకైనా సాహసురాలివే గదా! మీనాన్నగారూ వాళ్లూ ఏమనుకుంటారో' అన్నాను. 'ఏమనుకుంటే మాత్రం నాకేంభయం? నాకిష్టం లేదు అక్కడుండడానికి. వచ్చేశాను' అన్నది పద్మ నవ్వుతూను.

౫

ఆనాడు మొదలుకొని మేము మూడు నెలల వరకును కులాసాగానే గడిపాము. నాకు నెలకు నూటయాభై రూపాయలు మావాళ్ల దగ్గరనుండి వచ్చేది. దాంతోనే ఇద్దరము చిలకా గోరింకలాగు కాలక్షేపం చేస్తుండేవాళ్లము. మేము వెళ్లిన పది రోజులకు నాస్నేహితుడొకడు బీచిదగ్గర కనబడ్డాడు. వాడిపేరురంగారావు. వాడక్కడ బియ్యే సీనియరు లైలా కాలేజీలో చదువుతున్నాడట. మదరాసులో నాలుగు సంవత్సరములనుంచి ఉండబట్టి ప్రపంచకములోని ఫేషన్లన్నీ వాణ్నే మోహించాయి. వాడితో వాడావూరు వచ్చినప్పటినుండీ కాలక్షేపం చేస్తున్నాయి ఫేషన్లు. వాణ్ని నేనే గుర్తుపట్టలేకపోయాను. ఆ వేళ సాయంకాలము ఇద్దరము బీచినుంచి వెళ్లిపోయేటప్పుడు 'రంగా! రేపొకసారి మాఇంటికిరారా' అని చెప్పి ఇంటినంబరిచ్చాను. వాడు మర్నాడు ఉదయం ఎనిమిదిగంటలకు హాజరయ్యాడు. మేమిద్దరమూ కూర్చుని మాట్లాడుకుంటూంటే లోపల్నుంచి పద్మ 'వంటైంది, మడిగట్టుకోవచ్చును' అంది. 'ఎవరామె?' అన్నాడు రంగారావు. 'నావైఫ్' అని జవాబిచ్చాను. మాపద్మను పిల్చి రంగారావుకూడా భోజనానికొస్తా' డని చెప్పాను. 'ఇద్దరూ లేవచ్చును లెండి' అంది. ఇద్దరుమూ భోంచేసి కూచుని కొంతసేపు బాతాఖానీవేశాక వాడెళ్లిపోయాడు.

ఇట్లాగే ప్రతిరోజూ మావాడు ఎప్పుడో ఒకప్పుడు మాఇంటికొచ్చి ఒకగంటసేపు బాతాఖానీవేసి వెళ్లిపోతూండే వాడు. మాపద్మకూడా చిరపరిచయురాలిలాగ చాలాసోషల్ గా మాట్లాడుతూండేది రంగారావుతోకూడాను. మాముగ్గురకూ ఒక్కటే ప్రాణం మోస్తరుగా ఎక్కువ స్నేహంగా ఉండేవాళ్లం. నేనింట్లో లేనప్పుడు కూడా రంగారావు వచ్చి పద్మతో మాట్లాడి వెళ్లిపోతూండేవాడు. ఓరోజున పద్మతండ్రివచ్చి నీతులుచెప్పి తనతో ఇంటికిరమ్మంటే నేనిక మీ ఇళ్లకురాను. నాకూ మీకూ ఏమీ సంబంధం లేదు. మీత్రోవమీది-నాత్రోవనాది - పొండి' అన్నదట. సరేఅని ఆయన నెత్తిని గుద్దేసుకొని ఇంటికెళ్లిపోయాడట. ఆయనొచ్చినపుడు నేను మాస్నేహితుడి రూముకెళ్లాను. ఇంటికొచ్చాక పద్మ జరిగిన సంగతంతా చెప్పింది. ఈవిధంగా మూడునెలలును ముగ్గురమూకలసి సుఖంగా గడిపాము.

౬

రంగారావు క్రిమేపీ మాఇంటికి రాకపోకలను హెచ్చించి, చివరకు వారానికైదురోజులు మా యింట్లోనే భోంచేసి ఉంటూండేవాడు. వాడు పద్మతో నేనింట్లో ఉండగానే రహస్యాలు మాట్లాడ్డం—ఉన్నంతసేపూ పద్మతోనే మాట్లాడుతూ కూర్చోడం నామొహం వైపైనా చూడకుండా—పద్మకూడా నన్నుచూసినపుడు, నేను మాట్లాడినపుడు చిరాకు పడుతూండడం చూస్తే నాకే పాలుబోయేదికాదు. పద్మకు నామాటయందు లక్ష్యం పోయింది. తనిష్టంవచ్చినట్లు నేనుండాలంటుంది. 'ఏమిటిచెప్మా - ఇల్లాఉంటోంది. పదిహేను రోజుల్నుంచీను' అని అలోచిస్తే మనస్సులో ఏదో ఆవేదన కలిగేది. అట్లాగే కాలంగడుపుతూంటే ఒకరోజున పద్మకు ఏదోవిషయంలో కోపంవచ్చి నన్ను కఠినంగా దూషించి—తనింక నాతో ఉండలేనని, తనిష్టంవచ్చినచోటికి వెళ్లిపోతానని—నాతో వేతవ పడలేనని, స్పష్టంగా చెప్పేసింది. నేను నిర్ఘాంతపోయి 'ఏమిటిపద్మా! వెళ్లిపోతావా?' అన్నాను. 'నువ్వేం పుస్తె కట్టినవాడవా? పుస్తెకట్టినవాడే లెఖ్కలేనప్పుడు—నువ్వా నన్నడ్డగించేవాడవు? మూర్తీ! నువ్వింత పిచ్చివాడవేం? నేను స్వేచ్ఛావిహారిణ్ని. ఇంకనైనా తెలుసుకో' అని వీధిలో జట్కా వెళ్లుతుంటే పిల్చి రంగారావు అదివరకే ఏర్పరచిన ఇంటికెళ్లిపోయింది. స్నేహితుడింత ద్రోహం చేస్తాడని నేననుకోలేను. ఐనా స్వేచ్ఛావిహారిణి అక్కడ మాత్రం నిలుస్తుందా?' అని విచారించాను.

పద్మ వెళ్లిపోయాక నాకు పట్టలేని దుఃఖం వచ్చింది. ఏంచాస్తాను? చాలాసేపు ఏడ్చాను. చచ్చిపోదామా? అనుకున్నాను. కాని చావబుద్ధేయలేదు. ఇంక ఆవూళ్లో ఉండడం నాకిష్టంలేకపోయింది. అంతటితో చదువుకు స్వస్తిచెప్పి ఆ రాత్రి మెయిల్లో బయల్దేరి ఇంటికి వచ్చేశాను. కానీ ఆవిచారంవల్ల చాలా నీరసపడిపోయాను. మాఅమ్మ 'ఏంరానాయనా వచ్చేశావు?' అని అడిగింది. నాకానీళ్లుపడలేదని, వెళ్లిందిమొదలు జబ్బుపడుతూనే యున్నానని, ఇంక నేనావూరు వెళ్లనని స్పష్టంగా చెప్పేశాను. నేను ఏలూరు చేరకముందే ఒకనెలరోజులక్రిందట పద్మతండ్రిని రాజమండ్రి ట్రాన్సుఫర్ చేశారట. బతికానురా బాబూ అనుకొన్నా. ఈసంగతి తెలియగానే ఆ రోజు మొదలుకొని ఏస్త్రీముఖంవైపు చూసేవాణ్నికాను. అసలు స్త్రీ అంటేనే నాకు చాలా భయంగా ఉండేది.

తర్వాత ఒకనెలరోజులకు 'పద్మావతి అనెడి యువతిని, రంగారావు అనెడి బియ్యేస్టూడెంటు కత్తితోపొడిచిచంపి—తాను ఆత్మహత్య చేసికొన్నాడు. కారణములెవ్వరికిని తెలియవు' అని పేపర్లోపడ్డది. నేను, పద్మకు బుద్ధినిశ్చలత లేకపోవుటచేతను, రంగారావు క్రూరత్వమువలనను అట్లా జరిగిఉంటుందని ఊహించుకొన్నాను. అసలు కారణమేమైనాగానీ పురుషుడైననూ, స్త్రీయైననూ సరియైన ప్రవర్తన(క్యారక్టర్) లేనివాళ్ల స్థితి చివరకీవిధంగానే పరిణమిస్తుందని నాఉద్దేశ్యం.